క్లుప్తంగా

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఆత్మకూరు : మండలంలోని లింగమడుగుపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు సీఐ సంతోశ్ తెలిపారు. గ్రామంలోని వేముల వీరస్వామి బావిలో మృతదేహం కనిపించగా పోలీసులకు సమాచారం అందించినట్లు సీఐ తెలిపారు. బావిలో నుంచి మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించి ఎంజీఎం మార్చురీకి తరలించినట్లు తెలిపారు. మృతుడి వయస్సు 45 నుంచి 50 సంవత్సరాలు ఉంటుందని, తెలుపు రంగు గీతల ఫుల్ షర్టు, నీలంరంగు ఏడో నంబర్ చెప్పులు ధరించి ఉన్నట్లు తెలిపారు. కుడి చేయికి రింగు ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం వంగర పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై దివ్య శుక్రవారం తెలిపారు. రత్నగిరి గ్రామ శివారులో పేకాడుతున్నారని సమాచారం వచ్చిందన్నారు. దీంతో దాడులు నిర్వహించి నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. వారి నుంచి పేకాట ముక్కలు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తప్పుడు పత్రాలు సృష్టించిన వ్యక్తుల అరెస్ట్

శాయంపేట : తప్పుడు పత్రాలు సృష్టించి భూమిని ఆక్రమించుకున్న వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై పరమేశ్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొప్పుల గ్రామ శివారులోని అడిదల మాల్లారెడ్డికి వారసత్వంగా వచ్చిన భూమిలో నుంచి 14 గుంటల భూమిని అదే గ్రామానికి చెందిన దేవు వెంకటయ్య, సాంబయ్య, రాజయ్య తప్పుడు పత్రాలు సృష్టించి ఆక్రమించుకున్నారని మల్లారెడ్డి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో విచారణ చేపట్టి వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వేలేరు : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎర్రబెల్లి గ్రామంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అటువైపుగా ముల్కనూరుకు చెందిన వల్లపు బాలయ్య తన ట్రాక్టర్ ద్వారా అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తుండగా పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి గాయాలు

నడికూడ : ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో ఒకరు గాయాలపాలయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పులిగిల్ల గ్రామానికి చెందిన కల్యానపు రాజేశ్వర్ యూరియా కోసం బైక్‌పై వరికోల్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో పరకాల డిపోకు చెందిన బస్ వరికోల్ నుంచి పరకాల వస్తూ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో రాజేశ్వర్‌కు గాయాలు అవడంతో గమనించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించారు. చికిత్స కోసం హనమకొండలోని ఓ ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది.


అంగన్‌వాడీల ముందస్తు అరెస్టు



అంగన్‌వాడీ కార్యకర్తలను అరెస్టు చేసిన పోలీసులు

ఐనవోలు : మండల వ్యాప్తంగా పలు గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలను శుక్రవారం స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకుని ముందస్తు అరెస్టు చేశారు. హైదరాబాద్‌లోని ప్రజావాణి కార్యక్రమానికి వెళ్తున్నారనే సమాచారం మేరకు ముందస్తు అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

నందీశ్వరుడికి ప్రదోషకాల అభిషేకం



పూజలు చేస్తున్న భక్తులు

ఐనవోలు : మల్లికార్జునస్వామి ఆలయంలో బహుళ త్రయోదశిని పురస్కరించుకుని శుక్రవారం అర్చకులు ప్రదోషకాల నందీశ్వర అభిషేకం నిర్వహించారు. సాయంత్రం నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు చేసి పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి శనిగలు, పండ్లను నైవేద్యంగా సమర్పించారు. గర్భాలయంలో స్వామి వారికి, నందీశ్వరుడికి ఏక కాలంలో హారతి సమర్పించారు. ముఖ్య అర్చకుడు మధుకర్‌శర్మ, వేదపండితులు పురుషోత్తమశర్మ, విక్రాంత్ వినాయక్ జోషి, అర్చకులు నందనం భానుప్రసాద్, మధుశర్మ భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిఘా నేత్రం.. ఒక్కొక్కటిగా మాయం

- కనెక్షన్ లేకపోవడంతో మూలకు పడుతున్న సీసీ కెమెరాలు
- లోపించిన అధికారుల పర్యవేక్షణ
- అపహరిస్తున్న దొంగలు

నడికూడ : ఒక సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని గ్రామాల్లో పోలీసు అధికారులు అవగాహన సదస్సు నిర్వహిస్తుంటారు. కానీ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిర్వహణలోపంతో మూలకుపడుతున్నాయి. అదే అదునుగా భావిస్తున్న దొంగలు నిఘా నిత్రాలను ఒక్కొక్కటిగా అపహరిస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. నడికూడ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మండల కేంద్రానికి చెందిన ఎన్ఆర్ఐ 30 సీసీ కెమెరాలు ఏర్పాటు



వాటర్ ట్యాంక్ వద్ద ఉన్న సీసీ కెమెరాలు (ఫైల్)

చేశారు. కానీ వాటికి కనెక్షన్ ఇవ్వకపోవడంతో నాలుగేళ్ల నుంచి అవి నిరుపయోగంగా మారాయి.

సీసీ కెమెరాలు మాయం

దాదాపు ఆరు నెలల క్రితం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఉన్న సీసీ కెమెరాలు, పోచమ్మ గుడి వద్ద ఉన్న సీసీ కెమెరాలను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. అయితే ఎవరు కూడా పోలీసులకు



వాటర్ ట్యాంక్ వద్ద చోరీ అయిన సీసీ కెమెరాలు

ఫిర్యాదు చేయలేదు. ఇటీవల మరోమారు మండల కేంద్రంలోని వాటర్ ట్యాంక్ వద్ద గల రెండు సీసీ కెమెరాలను చోరి అయినట్లు స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే సీసీ కెమెరాలను వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

రాష్ట్రంలో కొనసాగుతున్న అసమర్థ పాలన

- మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

శాయంపేట : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అసమర్థ పాలన కొనసాగిస్తుందని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి విమర్శించారు. అధికార బలం చూసుకుని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. శుక్రవారం మైలారం గ్రామంలోని పెద్ద చెరువు కట్టను ఆయన పరిశీలించి మాట్లాడారు. హుస్సేన్‌పల్లి నుంచి మైలారం వరకు పెద్ద చెరువు కట్ట మీదుగా రోడ్డు నిర్మాణానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రూ.1 కోటి 60లక్షలతో నిధులు మంజూరు చేసి పనులను ప్రారంభించినట్లు చెప్పారు. కానీ కాంగ్రెస్ నాయకులకు కట్ట పక్కనే వ్యవసాయ భూమి ఉండంతో కట్టను, దళితులకు సంబంధించిన స్మశాన వాటికను ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. నీటిపారుదల శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేసి చెరువును ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాను వేసిన శిలాఫలకాల పక్కనే




మైలారం పెద్ద చెరువు కట్టను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి

ప్రస్తుత ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శిలాఫలకాలు వేసి ప్రజలను ఏమార్చే ప్రయత్నం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అనంతరం మండలంలోని పత్తిపాక గ్రామంలో యూరియా కోసం బారులుదీరిన రైతులతో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సరిపడా యూరియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణంతో భగీరథ పైపులు ధ్వంసం

పరకాల : పట్టణంలో డ్రెయినేజీ నిర్మాణం పేరిటా కాంట్రాక్టర్ వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు దారితీస్తుంది. తాగునీరు, ఇంటి అవసరాలకు మిషన్ భగీరథ నీటిపై ఆధాపడిన పట్టణ ప్రజలు సదరు కాంట్రాక్టర్ తీరుతో ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు మండిపడుతున్నారు. కాల్వల కోసం జేసీబీతో తవ్వకాలు చేస్తూ మిషన్ భగీరథ పైపులను ఇష్టానుసారంగా ధ్వంసం చేస్తున్నారని, దీంతో తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదని పట్టణవాసులు వాపోతున్నారు.



బ్రాహ్మణవాడలో వృథాగా కాల్వలో పోతున్నా మిషన్ భగీరథ నల్లా నీరు

ఘనంగా మోదీ జన్మదిన వేడుకలు



పరకాల : దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు పట్టణంలో మహిళా మోర్చా, బీజేపీ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చైతన్య మోడల్ హైటెక్ స్కూలు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు షీల్డ్, నోటుబుక్కులు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ రాజు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నిరంజన్, జిల్లా ప్రధాన కార్యదర్శి జయంత్‌లాల్, పట్టణ ప్రధాన కార్యదర్శి పురుషోత్తం, ఉపాధ్యక్షుడు నరేశ్, మహిళ నాయకురాలు సంగీత, సునంద, సునీత, శారద తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి



చేతి సంచులు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ బాధ్యులు

ఆత్మకూరు : ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని లయన్స్‌క్లబ్ ఆత్మకూరు శాఖ అధ్యక్షుడు ఏరుకొండ రవీందర్‌గౌడ్ కోరారు. ప్లాస్టిక్ వినియోగంతో వచ్చే నష్టాలపై శుక్రవారం ఎంపీపీఎస్ గొల్లవాడ పాఠశాలలో «పర్యావరణ పరిరక్షణ – అందరి బాధ్యత» అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. జీవితంలో ప్లాస్టిక్ వినియోగం వల్ల మనుషులు, జంతువులు రోగాల బారిన పడుతున్నారని అన్నారు. ప్లాస్టిక్ వల్ల నీరు కూడా కలుషితమవుతుందని దానివల్ల వ్యాధులు ప్రబలుతున్నాయని అన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి కాగితం సంచులు, జనపనారతో చేసిన సంచులు వినియోగించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు చేతి సంచులు పంపిణీ చేశారు. అనంతరం హనుమకొండ జిల్లా లయన్స్ క్లబ్ గవర్నర్ చంద్రశేఖర్ ఆర్య జన్మదినాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు రసాయనాలు వాడని పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పెండెం రాజు, క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ టింగిలికార్ సత్యనారాయణ, క్లబ్ ప్రధాన కార్యదర్శి నాగ బండి శివప్రసాద్, ఉపాధ్యక్షుడు పాపని రవీందర్, క్లబ్ మాజీ అధ్యక్షుడు రేపూరి దేవేందర్‌రెడ్డి, కోశాధికారి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి

- వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు

దామెర / ఎల్కతుర్తి / నడికూడ: నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి పొందవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు వెంకన్న, కృష్ణ, పద్మజ, మంజుభార్గవి అన్నారు. ప్రతి గ్రామంలో నాణ్యమైన విత్తనాలు కార్యక్రమంలో భాగంగా దామెర మండలంలోని ఊరుగొండ, ఎల్కతుర్తి మండలంలోని దామెర, నడికూడ మండల కేంద్రంలో శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకన్న, డాక్టర్ భార్గవి కంది పంటను వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకంగా భాగంగా వరి, కంది విత్తనాలు రైతులకు సరఫరా చేయడం జరిగిందన్నారు. అందులో భాగంగా



దామెర : అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

డబ్ల్యూఆర్‌జీ –121 రకం కంది అధిక దిగుబడి ఇవ్వడంతో పాటు వడలు, తెగులును తట్టుకుంటుందని అన్నారు. ఏఓ రాకేశ్, ఏఈఓ రామకృష్ణ, రైతులు తదితరులు ఉన్నారు.

రేపు ఉచిత మెగా హెల్త్‌క్యాంప్

పరకాల : పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ సమీపంలోని స్వర్ణ గార్డెన్‌లో ఆదివారం స్వేరోస్ ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్‌క్యాంప్ నిర్వహించనున్నట్లు పరకాల పట్టణ స్వేరోస్ నాయకులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మల్లారెడ్డి నారాయణ ఆసుపత్రి వైద్యులు పాల్గొని గుండె, కేన్సర్, గైనిక్‌తో పాటు పలు ఆరోగ్య సమస్యలకు వైద్యం అందించేందుకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

108, 102 సేవలను వినియోగించుకోవాలి

ఆత్మకూరు : 108, 102 సేవలను ప్రజలు వినియోగించుకోవాలని హనుమకొండ జిల్లా మేనేజర్ మండ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆయన అంబులెన్స్‌లోని అత్యవసర వైద్య పరికరాలు, మందుల రికార్డులను పరిశీలించారు. ఏడాదిలో ఇప్పటి వరకు 760 మంది ప్రాణాలను కాపాడిన సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అత్యవసరమైన వైద్య సేవలు అందించేందుకు 108, 102 అంబులెన్స్‌లు అందుబాటులో ఉన్నాయని అన్నారు. 102 ద్వారా మహిళలు ప్రసవం అయ్యే వరకు ఇంటి నుంచి ఆస్పత్రులకు, మళ్లీ ఇంటికి ఉచితంగా తీసుకెళ్లడం



సిబ్బందితో జిల్లా మేనేజర్ శ్రీనివాస్

జరుగుతుందన్నారు. ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని అన్నారు. సిబ్బంది శ్రీనివాస్, రమేష్, నరేష్, కత్తుల రాజు, ప్రకాశ్, జగదీశ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం

ధర్మసాగర్ : మండలంలోని ఉనికిచర్లలో వారం రోజులుగా కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ క్యాంప్ శుక్రవారం ముగిసింది. పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల (అటానమస్) ఎన్ఎస్ఎస్ యూనిట్–1 ఆధ్వర్యంలో ఏడో రోజు ఉదయం ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో యోగా గురువు మహేశ్ యోగా చేయించారు. అనంతరం వలంటీర్లు గ్రామంలో సర్వే నిర్వహించారు. అనంతరం లెఫ్టినెంట్, ప్రొఫెసర్, ప్రిన్సిపాల్ చంద్రమౌళి మాట్లాడుతూ.. పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల(అటానమస్) వలంటీర్లు ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్ ద్వారా పలు సమస్యలను పరిష్కరించే నైపుణ్యం నేర్చుకున్నారని అన్నారు. ప్రొఫెసర్ ఆనంద కిశోర్ మాట్లాడుతూ.. దేశ అభివృద్ధి తరగతి గదిలో రూపుదిద్దుకుంటుందని, దీనిలో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల పాత్ర కీలకమని అన్నారు. వలంటీర్లు స్కిట్, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ప్రోగ్రాం అధికారులు కవిత, రామారత్నమాల, డాక్టర్ మమత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుహాసిని, డాక్టర్ సురేష్ బాబు, పీడీ సుజాత, రిటైర్డ్ ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్,



వలంటీర్లతో ప్రొఫెసర్లు

ప్రసాదరావు, కుమార స్వామి, దేవేందర్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

దామెర : మండల కేంద్రంలో శనివారం నుంచి ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్లు హనుమకొండ జిల్లా ఒకేషన్ జూనియర్ కళాశాల ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఆర్. ప్రవీణ్‌కుమార్, డాక్టర్ ఎస్. శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. కళాశాలకు చెందిన 100 మంది విద్యార్థులు ఈ శిబిరంలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. 26వ తేదీ వరకు శిబిరం కొనసాగుతుందని తెలిపారు.

విద్యార్థులకు గైడ్ల పంపిణీ

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని ములుకనూరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినులకు గైడ్లను పంపిణీ చేశారు. ఈర్ల శ్రీనివాస్ జ్ఞాపకార్థం తన స్నేహితులు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. స్నేహితులు ప్రసాద్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మంచినీటి బావిని శుభ్రం చేయించండి

నర్సంపేట : చెన్నారావుపేట శివారులోని పాత పోచమ్మ ఆలయం పక్కనే ఉన్న ప్రభుత్వ మంచినీటి బావిని శుభ్రం చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. సదరు బావిలో కొంగ చనిపోగా కళేబరం నీటిలోనే ఉందని, చెత్తాచెదారం పేరుకుపోయి నీరు కలుషితం అయ్యిందని తెలిపారు. ఆ బావి నీటినే నల్లాల ద్వారా ప్రతిరోజూ గ్రామస్తులకు సరఫరా చేస్తున్నారని గ్రామ పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతున్నారు.

ఒత్తిడిని జయించేందుకు యోగా చేయాలి

- కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ అచ్చయ్య

కమలాపూర్ : యోగాతో ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతిఒక్కరూ యోగా సాధన చేయాలని కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ అచ్చయ్య అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హార్ట్‌ఫుల్‌నెస్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ హనుమకొండ సహకారంతో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో యోగాపై శుక్రవారం ప్రారంభమైన మూడు రోజుల శిక్షణ, అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యోగా ఆరోగ్యపరంగా శరీరానికి బలం, ఆలోచన, రోగ నిరోధక శక్తిని ఇస్తుందన్నారు. మానసిక ఒత్తిడి, ఆందోళన, భయాలను తగ్గిస్తుందని, ఆధ్యాత్మికంగా మనసును శాంతపరిచి ఆత్మజ్ఞానం కలిగిస్తుందన్నారు. యోగాతో ఏకాగ్రత పెరుగుతుందని, చదువుపై దృష్టి సారించి మతిమరుపు తగ్గి



మాట్లాడుతున్న డాక్టర్ అచ్చయ్య

జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. అనంతరం రిటైర్డ్ స్కూల్ అసిస్టెంట్ ఎం.శారద విద్యార్థులతో యోగా సాధన, మెడిటేషన్ చేయించారు. ప్రిన్సిపాల్ మాధవి, ఎన్ఎస్ఎస్ పీఓ జ్యోతి, స్టూడెంట్ కౌన్సిలర్స్ కుమార్, రజిత, అధ్యాపకులు శ్రీనివాస్‌రెడ్డి, కవిత, కుమారస్వామి, శోభాదేవి, యామిని, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

తహసీల్దార్‌గా ప్రవీణ్‌కుమార్



శాయంపేట : తహసీల్దార్‌గా ప్రవీణ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ కల్వల సత్యనారాయణ బదిలీపై వెళ్లగా ప్రవీణ్‌కుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. డిప్యూటీ తహసీల్దార్ ప్రభావతి, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

టీయూఎఫ్ జిల్లా కోఆర్డినేటర్‌గా వెంకటేష్



శాయంపేట : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం హనుమకొండ జిల్లా కోఆర్డినేటర్‌గా తడుము వెంకటేష్‌ను నియమిస్తూ ఆ ఫోరం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పాడిశెట్టి గణేశ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నియామకపత్రం అందించారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర చైర్మన్ శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ రజనీకాంత్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

దామెర : బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, డాక్టర్ పగడాల కాళీప్రసాద రావు అన్నారు. పసరగొండకు చెందిన మంద సదయ్య, ఒగ్లాపూర్‌కు చెందిన కీసర సమ్మయ్య అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకుని శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం కొంత ఆర్థికసాయం అందించారు. వారి వెంట జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరాంరెడ్డి, మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్, రాజు, రమేష్, బుచ్చిరెడ్డి, మనోజ్‌కుమార్, రాజు, మధుకర్ తదితరులు ఉన్నారు.

ప్రింటర్ అందజేత



ఆత్మకూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 2006 – 2007 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు శుక్రవారం ప్రింటర్ అందించారు. పాఠశాల హెచ్ఎం నిర్మలకుమారి, ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులను అభినందించారు.

సొంత ఖర్చుతో మట్టి తొలగింపు



ధర్మసాగర్ : మండలంలోని ముప్పారం చెరువు నుంచి నారాయణగిరి గ్రామ చెరువు వరకు కాల్వలో మట్టి కూరుకుపోయింది. దీంతో వరదనీరు చెరువులోకి వెళ్లకుండా ఉందని రైతులు ఆందోళన చెందుతున్న విషయాన్ని నారాయణగిరి గ్రామస్తుడు రామ్‌రెడ్డి సొంత ఖర్చుతో శుక్రవారం పూడికతీత పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

అయ్యో వినాయకా..



చెరువులో పూర్తిస్థాయిలో నిమజ్జనం కాని గణపతి విగ్రహాలు

మండలంలోని కటాక్షపూర్‌లో ఇటీవల గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించిన విషయం తెలిసిందే. కాగా స్థానిక చెరువులో వివిధ శాఖల అధికారుల సమన్వయంతో విగ్రహాలను నిమజ్జనం చేశారు. జాతీయ రహదారి పక్కన ఉన్న ఈ చెరువులో విగ్రహాలను పూర్తిస్థాయిలో నిమజ్జనం చేయకపోవడంతో చెరువు ఒడ్డుపై కనబడుతున్నాయి. దీంతో వాహనదారులు, భక్తులు నిర్వాహకుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విగ్రహాలను చెరువులోపల నిమజ్జనం చేయాలని భక్తులు, ప్రజలు కోరుతున్నారు.

– ఆత్మకూరు

క్రీడలతో మానసిక ప్రశాంతత

- ఎంపీడీఓ ఫణిచంద్ర

శాయంపేట : ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉంటనే సమాజమంతా ఆరోగ్యంగా ఉంటుందని, క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీఓ ఫణిచంద్ర అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ (బాలుర)లో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ఐ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు.. క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని, ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని విద్యార్థులకు సూచించారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ అండర్–14,17, విభాగంలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. ఎంఈఓ, ఎస్‌జీఎఫ్ఐ అధ్యక్షుడు గడ్డం భిక్షపతి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జనార్దన్, టీఆర్టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజిబాపురావు, ఎంజేపీ పాఠశాల ప్రిన్సిపాల్ రేవతి, బాలికల పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలో జరిగిన ఎస్‌జీఎఫ్ మండలస్థాయి ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ అండర్



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఫణిచంద్ర

–14,17 క్రీడా పోటీల్లో ప్రథమ, ద్వితీయస్థానాల్లో నిలిచిన గుడెప్పాడ్‌లోని ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సీఐ, ఎంపీడీఓ, ఎంఈఓ, ప్రిన్సిపాల్, పీఈటీ, అభినందించారు.

వేలేరు : మండలస్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు క్రీడా పోటీల్లో పీచర ప్రభుత్వ పాఠశాల బాలికల జట్టు ప్రతిభ కనబరిచింది. అండర్–17, 14 బాలికల కబడ్డీ విభాగంలో ప్రథమ స్థానం, అండర్– 17 ఖోఖోలో మొదటి స్థానంలో నిలిచినట్లు హెచ్ఎం శ్రీదేవి, ఫిజికల్ డైరక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు.

రైతులు ఆందోళన చెందొద్దు

ధర్మసాగర్: యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్ అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎరువుల కేంద్రాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వానాకాలంలో ఎలాంటి ఎరువుల కొరత లేకుండా ఇంతవరకు యూరియా పంపిణీ చేసినట్లు తెలిపారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో 10 ఏఎంటీఎస్, శ్రీ గణేశ్ ఫర్టిలైజర్స్ ధర్మపురం 10 ఎంటీఎస్, విష్ణు ప్రియా ఫర్టిలైజర్స్ సోమదేవరపల్లి 5, హనుమాన్ ట్రేడర్స్ నారాయణగిరి 5, ప్రవీణ్ చారి ఫర్టిలైజర్స్ దేవునూరు 5, వెంకటేశ్వర అగ్రిమార్ట్ రాపాకపల్లి 5, మొత్తం ఆరు కేంద్రాలుగా 40 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు తెలిపారు. రైతుల అవసరాల నిమిత్తం మరింత యూరియా అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. రైతులు ఈ విషయంపై ఆందోళన చెందొద్దన్నారు. వారి వెంట మండల వ్యవసాయ అధికారి పాలకుర్తి రాజేశ్, సాంకేతిక వ్యవసాయ అధికారి అఫ్జల్ పాషా, సొసైటీ కేంద్రం నిర్వాహకులు ఉన్నారు.